

మియాపూర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు, బీఆర్ఎస్ శ్రేణులు



మణికొండలో మర్రిచెట్టు కూడలి వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బడంగ్‌పేటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తదితరులు

## మహిళలపై సీఎం అనుచిత వ్యాఖ్యలు..

# భగ్గుమన్న బీఆర్ఎస్



అంబర్‌పేటలో నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళా నేతలు, నాయకులు



పీర్జాదిగూడలో.. వరంగల్ జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న మేయర్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, మహిళా నేతలు

**సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై నగర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు**

**ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**సీఎం, డిప్యూటీ సీఎం దిష్టి బొమ్మలు దహనం**

**బీఆర్ఎస్ శ్రేణుల అరెస్టులు, నిర్బంధాలు..**

అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పి.సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డితో పాటు మహిళలపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం భగ్గుమన్నది. వారు చేసిన వ్యాఖ్యలపై గురువారం బీఆర్ఎస్ శ్రేణులు నగర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు, రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. నగరంతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం, డిప్యూటీ సీఎం దిష్టి బొమ్మలను దహనం చేశారు. చాలా చోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబూని మహిళలు నిరసన వ్యక్తం చేశారు. అలాగే రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలు చోట్ల నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్వీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. - సిటీ బ్యూరో



నిజాం కళాశాల నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులు షిగ వెంకట్ గౌడ్, జంగయ్య, నాగేందర్, అవినాష్ తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు



శంషాబాద్ రూరల్ : హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో రోడ్డు పై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, నాయకులు



ఆర్టీసీ ఎక్స్ రోడ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



సికింద్రాబాద్ : సీతాఫల్‌మండి చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లు హేమ, శైలజ, బీఆర్ఎస్ నాయకులు



ఉప్పల్ : చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ గీతాప్రవీణ్ ముదిరాజ్, హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు, కార్యకర్తలు



దుండిగల్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో.. మూడు కోతుల బొమ్మల చౌరస్తా వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్‌లో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లు శ్రీనివాస్‌రావు, శిరీష, మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీశ్ ఆరోరా, బీఆర్ఎస్ నేతలు



బడంగ్‌పేటలో .. ముఖ్యమంత్రి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## ఎమ్మెల్యే వేములకు సన్మానం



ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు

రామన్నపేట, ఆగస్టు 1 : చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై అసెంబ్లీలో ప్రసంగించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని వీవర్ సెల్ మండల ప్రధాన కార్యదర్శి గోశిక వెంకటేశ్వర్లు గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కూనూరు సాయి కుమార్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోడి పాండునాథ్, రాపోలు గణేశ్ పాల్గొన్నారు.

## మీ సేవ కేంద్రాల తనిఖీ



ఆత్మకూరు(ఎం) : మీ సేవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈ డిస్టిక్ మేనేజర్ సాయికుమార్

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 1 : మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాలను ఈ డిస్టిక్ జిల్లా మేనేజర్ సాయికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలు అందించాలని మీ సేవ కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట డీఎం నరేందర్ రెడ్డి, ఆర్ఐ మల్లికార్జున్‌రావు, మీ సేవ నిర్వాహకులు ఆంజనేయులు, మురళీకృష్ణ ఉన్నారు.

## యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్‌గా అనూష

యాదగిరిగుట్ట, ఆగస్టు 1 : యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్‌గా నల్లగొండ జిల్లాలోని చండూరు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనూష సాధారణ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కిశోర్ జనగాం జిల్లా కొండకండ్ల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనూషను నియమించారు. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట, ఆగస్టు 1 : మండలంలోని తాళ్లగూడెం గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎన్‌హెచ్ 163 వరంగల్ జాతీయ రహదారి వెంట ఎస్వీ హైవే సిటీ వెంచర్ పక్కన సర్వే నంబర్ 220 భూమిలో కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పశువుల కాపరి చూసి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం 60 ఏండ్ల పురుషుడిదిగా గుర్తించామని, ఒంటిపై జంధ్యం, మొలతాడు, నిక్కరు ఉన్నట్లు సీఐ తెలిపారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించామన్నారు. ఆ వ్యక్తి మృతిచెంది సుమారు రెండు నెలలు కావచ్చని తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి డీఎన్ఏ నిమిత్తం ఎముకలను సేకరించామన్నారు. అస్తి పంజరాన్ని తాళ్లగూడెం గ్రామ పంచాయతీకి అప్పగించగా దహన సంస్కారాలు పూర్తి చేశారని తెలిపారు. కారోబార్ మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**– మండల వైద్యాధికారి అశ్విన్‌కుమార్**

రామన్నపేట, ఆగస్ట్ 1 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అశ్విన్ కుమార్ అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లో, ఇంటి బయట నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. దోమల వ్యాప్తితో ఫైలేరియా, డెంగీ, మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల రోగాల బారిన పడకుండా ఉండవచ్చని సూచించారు.

## 3న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

సిటీబ్యూరో, ఆగస్టు 1 ( నమస్తే తెలంగాణ ) : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ( టామ్‌కామ్) ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. జర్మనీ, జపాన్‌లో ఉద్యోగాలు చేయాలనుకునే వారికి ఈ డ్రైవ్ ఉపయోగపడుతుందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ అర్హత ఉండి మూడేండ్ల ఉద్యోగ అనుభవం ఉన్న ఆసక్తి గల అభ్యర్థులు డ్రైవ్‌కు హాజరుకావాలని కోరారు. 20–40 ఏండ్ల మధ్య వయస్సున్న వారికి మాత్రమే అవకాశమని చెప్పారు. 8125251408, 9100798204 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## చేనేత రంగాన్ని నీరుగారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**– సమస్యలు పరిష్కరించాలని పుట్టపాకలో నేతన్నల పోరాట దీక్ష**



పుట్టపాకలో దీక్షకు దిగిన చేనేత కళాకారులు, కార్మికులు

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 1 : పనులు లేక, నేసిన వస్త్రాలు అమ్ముడుపోక పూట గడవడం కష్టంగా మారి చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టపాకలో చేనేత కళాకారులు, కార్మికులు ఒక్క రోజు దీక్షకు దిగారు. ఈ సందర్భంగా జాతీయ చేనేత అవార్డు గ్రహీత ఆనందం నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అమలు చేసిన చేనేత బీమా, చేనేత మిత్ర, త్రిఫ్ట్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. చేనేత వ్యక్తిగత రుణాలను రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని, 40 శాతం నూలు సబ్సిడీని నేరుగా కార్మికుడి ఖాతాలో జమ చేయాలని కోరారు. నిల్వ ఉన్న సరుకులను కొనుగోలు చేసి చేతి నిండా పని కల్పించి ఆదుకోవాలన్నారు. చేనేత రంగాన్ని నీరుగారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా కండ్లు తెరవకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆందోళనలో గూడెల్లి నాగరాజు, రావిరాల శ్రీనివాస్, రావిరాల మల్లేశ్, వర్కాల వెంకటేశం, రాంబాబు, గజం శ్రవణ్ కుమార్, కర్నాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ప్రజా కలల పండుగను విజయవంతం చేయాలి

భువనగిరి అర్బన్, ఆగస్టు 1 : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 7న నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రజా కలల పండగను విజయవంతం చేయాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా కలల పండుగకు రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు. కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, నాయకులు పుట్ట రమేశ్, హేమలత, శంకర్, యాదగిరి, నర్సయ్య, రాములు, సుగుణమ్మ పాల్గొన్నారు.

## ఏబీకే ప్రసాద్ తెలుగు జర్నలిజానికి స్ఫూర్తి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సంజయ్ బారు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు

ఖైరతాబాద్, ఆగస్టు 1 : తెలుగు జర్నలిజానికి పూర్వ సంపాదకులు, సుప్రసిద్ధ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్ స్ఫూర్తి ప్రదాత అని వక్తలు పేర్కొన్నారు. ఏబీకే 89 నుంచి 90 వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏబీకే ప్రసాద్ జీవన సాఫల్య అభినందన సభ సంఘం అధ్యక్షుడు దాసు కేశవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 'అలుపెరుగని అక్షరాయుధుడు –ఏబీకే' గ్రంథాన్ని ముఖ్య అతిథిగా హాజరైన పూర్వ మీడియా సలహాదారు, ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ పూర్వ సంపాదకుడు డాక్టర్ సంజయ్ బారు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పూర్వ సంపాదకులు డాక్టర్ రామచంద్రమూర్తి, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్, విశాలాంధ్ర సంపాదకుడు ఆర్వీ రామారావుతో కలిసి ఆవిష్కరించి ఆయనకే అంకితమిచ్చారు. సంజయ్ బారు మాట్లాడుతూ ఏబీకే ప్రసాద్ ఒక మంచి జర్నలిస్టే కాదు గొప్ప రచయిత కూడా అని కొనియాడారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తాను ఏబీకే వద్ద శిష్యరికం చేయకపోయినా ఆయన అభిమానుల్లో తానొకరినని తెలిపారు. రామచంద్రమూర్తి మాట్లాడుతూ 90వ వసంతంలోకి అడుగుపెడుతున్నా ఆయన పఠనాసక్తి, రచనాసక్తి ఏ మాత్రం తగ్గలేదని, నేటికీ కాలమ్స్ రాస్తున్నారని తెలిపారు. ఈ సభలో వయోధిక పాత్రికేయ సంఘం కార్యదర్శి కె. లక్ష్మణ రావు, ఉడయవర్లు పాల్గొన్నారు.